


# శలభాలు

వనమాలి జగన్నాథ రావు



"ఇంత దారుణం ఎన్నడన్నా ఉందా!" నేను త్రుళ్లిపడి చూశాను. గుమ్మంలో ఒక యువకుడు నుంచుని ప్రశ్నాపూర్వకంగా చూస్తున్నాడు. అతని మొగంమీద ఆనందం అల్లరి చేస్తోంది. అతను మళ్లీ అందుకున్నాడు.

"చూస్తో, చూస్తో నిండు ప్రాణాలను ఎలా తీయగలుగుతారో నేను ఊహించలేను. జీవంతో ఉట్టిపడే మనిషిని, శవంగా మార్చేందుకు చేతులు ఎట్లా వస్తాయి?" సందేహంగా నావైపు చూశాడు, తన సందేహం తీర్చమన్నట్టు. నేను అతనివైపు సందేహంగా చూశాను- 'అసలు విషయం ఏమి' టన్నట్టు.

"మొన్న నా స్నేహితుణ్ణి ఖూనీ చేశారు, ఇప్పుడే పేపర్లో చూశాను. అతను పెద్ద ఆఫీసరు. చాలా యోగ్యుడు. అంత మంచివాణ్ణి ఇక చూడలేము." తన చేతిలో పత్రిక మరోకసారి చదువుకున్నాడు.

నేను అప్రయత్నంగా "పాపం!" అన్నాను. అతను గర్వసూచకంగా నావైపు చూశాడు. ప్రయత్నంతో పొరలివచ్చే కుతూహలాన్ని పొందుపరచుకొని "ఎందుకేత?" అని ప్రశ్నించాను.

అతను తీవ్రంగా స్థిరమైన కంఠంతో అన్నాడు: "ఎందుకేతా? కారణం ఏమైతేనేం? హత్య చేయవలసినంత దారుణం ఎందుకు జరగాలి? పైగా చూడండి- అర్థరాత్రి నిద్రపోతున్నవాణ్ణి గుండెల్లో పొడిచి చంపేశారు." ఈసారి నా జవాబుకు ఎదురు చూడకుండా, పక్క గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇది, నేను ఆ హోటలులో బసచేసిన రెండవ నాటి సాయంత్రపు సంఘటన. చాలా గమ్మత్తు మనిషి. నేను ఎవరు నువ్వని అడగలేను. తానెవరో చెప్పలేదు. పెద్ద పరిచయమున్నవానిలా మాట్లాడి వెళ్లిపోయాడు. నావంటి మరొక పరదేశి అని ఊరుకున్నాను.

మళ్లీ నా గది ముందునుంచి వెడుతూ ఆగి, గుమ్మంలో నుంచుని అన్నాడు:

"అందరం మరణిస్తాం... అది మామూలే. కాని- ఇటువంటి చావు కూడదు. గుండెలు ఆశలలో ఎన్నడూ చావకూడదు."

తను బూట్లతో పెద్దగా చప్పుడు చేసుకుంటూ, మెట్లు దిగి వెళ్లిపోయాడు. అతడు నడిచే విధానంలో సంతోషం గెంతులేస్తూ ఉంది.

ఆ మర్నాడు. ఇంకా తెల్లవారలేదు. నా గది తలుపు ఎవరో దురుసుగా తట్టేరు. విసుక్కుంటూ తెరిచాను. పోలీసులు! వరండానిండా మనుషులు.

"రాత్రి గది కెప్పుడు వచ్చారు?" ఇన్స్పెక్టర్ అడిగాడు. జవాబు ఇచ్చాను. "రాత్రి ఎప్పుడైనా పైకి వచ్చారా?" - "పక్క గదిలో ఏదైనా సందడి విన్నారా? అంటూ చాలా ప్రశ్నలు వేశాడు. అసలు సంగతి ఏమిటంటే- నా పక్కగదిలో రాత్రి ఖూనీ జరిగిందిట.

నేను ఆ గదిలోకి వెళ్ళాను. మంచంమీద ఆ యువకుడు మరణించి ఉన్నాడు. గుండెమీద పెద్ద గాయం- అంతా రక్తమయం.

నాకు తెలివి తప్పినట్లయింది. ఏవో ఊహలు తలలో సుడిగాలిలా తిరిగాయి. క్రితం సాయంత్రం మెట్లు అదిరేటట్లు నడిచిన వ్యక్తి చలనం లేకుండా వేలబడిపోయి ఉన్నాడు.

* * *

ఇప్పుడు అం[illegible]స్పష్టమయింది. జీవించి

ఉండగా అతని పేరేనా అడగలేను. మరణించగానే అతని జీవితాన్నే తెలుసుకున్నాను. ఆ సాయంత్రం అతని కళ్లలోని వెలుగుకు కారణం నాకీనాడు తెలుసు. అతని కథ అంతా విని మీరు కించపడరు. అంతేజరగాలనికూడా అంటారు. కానీ- అతను గంపెడాశను గుండెలో ఉంచుకొని నిద్రపోతున్నాడు. అర్థరాత్రి ఎవరో అతని గుండెనూ, ఆశనూ చీల్చివేశారు. అందుకేనా మీరు జాలిపడాలి.

అతనిది కోనసీమ. చిన్న వయసులోనే పెద్ద స్తికి అధిపతి అయాడు. మద్రాసులో కొన్ని రోజులు చదువుకొని, తరువాత అక్కడే స్థిరపడి పోయాడు.

అతనిలోని విద్యాసంస్కృతులు తూచి చెప్పలేను. అయినా కొన్ని స్థిరపడిన భావాలు అతనికి లేకపోలేదు. భగవంతుడు ధనాన్ని సృష్టించింది, దర్జాగా బ్రతకడానికే అన్నది అతని మొదటి సిద్ధాంతం.

సాధారణంగా, ధనికుల బిడ్డను డజనుమందయినా, స్నేహితులనబడేవారు ఉపగ్రహాలు ఉంటారు. ఆ ఉపగ్రహాల ఉక్కు వలయంలో మూలగ్రహం అసలు కనబడదు. ఒకవేళ ఏదైనా అసంభవం సంభవించి, ఉపగ్రహాలు ఊడిపోతే, అసలు గ్రహం విగ్రహం అయిపోతుంది.

అతని విషయం అలాకాదు. సమర్థుడు. తన్ని తానే చక్కపెట్టుకోగలడు. అంచేతనే అయి ఉంటుంది: మద్రాసులో ఇతనికి చాలా చెడ్డపేరు ఉంది. అతనేనా, అందరూ తన్ని 'మంచివా'డను కోవాలని ఏమాత్రం ప్రయత్నించినట్లు కనబడదు. బీడీ మొదలుకొని బ్రాందీవరకూ, బాహాటంగానే సేవిస్తూండేవాడు. ఇలా అని ఇతనిలో ఏమీ ప్రత్యేకత లేదనుకోడం పొరపాటు. అత్యద్భుతంగా టెన్నిసు ఆడగలడు, అనన్య సామాన్యంగా స్త్రీలతో మెలగగలడు. చూడ్డంతోనే, అతనిలో ఈ రెండుకళలూ ఉన్నాయని ఇట్టే పసిగట్టవచ్చు. ఆరడుగుల మనిషి-కండరాల శరీరం, ఉంగరాల తలకట్టు-కత్తివంటి ముక్కు, కొంటెకళ్లు.

అతనిగురించి చాలా చెడు విన్నాను. రంగేళీ-రాజా అనీ, రాటుదేరిన మోసగాడనీ, చాలా మందిని అన్యాయం చేశాడనీ-ఎన్నో కథలు చెప్పేరు. ఆ గాథల అగాధాలలో-ఆత్మార్పణలూ, ఆత్మహత్యలూగూడా ఉన్నాయి. అవన్నీ వ్రాస్తే ఇది అవినీతిచంద్రికఅయి ఊరుకొంటుంది.

ప్రపంచంలో-మూడే మూడు గొప్ప వస్తువులు కలిసి, అతనికి జీవిత మయాయి. ఒకటి, బ్రాందీ. రెండు, స్త్రీ. మూడు, టెన్నిసు. ఈ విషయంమీదనే సగం తెలియని స్థితిలో లోకానికి ఉపన్యసించేవాడు.

ఏదో అశుభఘడియను, ఆమె అతని మార్గాన ఎదురయింది. అతను అక్కడే ఆగిపోయాడు. ఆమెను ఆగమని కోరాడు. ఆమె వినలేదు. ఆపి తీరతానని ఎదురు వెళ్లాడు. ఆమె అతని జీవితాన్నే అక్కడితో ఆపివేసి, తన మార్గాన నడచిపోయింది.

ఆమె పేరు రజియా. ఈపేరయినా అసలు వ్రాయకుండా ఉందును. కానీ-మీకొక విషయం చెప్పాలి. అది చాలా అభాగ్యపు పేరు. ఆపేరుగల ఒకస్త్రీ పూర్వం భరతఖండానికి సుల్తానా.

ఆమె విషాదమరణ ప్రణయమధుర గాథ, ఇతిహాస సాహిత్య పల్లవాలలో పొంచి ఉంది. రజియానామక వనితా సఖ్యాన్ని ఎన్నడూ కోరకండి. ఆ స్త్రీ అగ్ని. ఆవేశంలో తాను బూడిదయి, తన సఖుణ్ణి దగ్ధం చేస్తుంది.

అతనుతన కోరికను తెలియచేసేసరికి, ఆమె ఒక సమస్యతో పెనగులాడుతూ ఉంది. తన భర్త మొద్దు బంధాల్ని తెంచుకొని, మరొకనితో వెళ్ళిపోయే ఊహాలో ఊగులాడుతూ వుంది.

"మీకోసం ఏమైనా అవుతాను- మీరుమాత్రం నాతో ఉండండి" అని అత నడిగాడు.

"మీరు ఏమీ అవనక్కరలేదు. సుఖంగా ఉండండి. దయ ఉంచి మళ్లీ ఆ విషయం ఎత్తకండి" అని ఆమె సమాధానమిచ్చింది.

తనవంటి యువకుణ్ణి, ధనికుణ్ణి కాదనడంలోని కారణం ఎంత వెదకినా అతనికి దొరకలేదు. ఆమె తిరస్కారాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు. స్త్రీ తనని చీకటిలో దాచుకొంటుంది. అసలు తెలుసుకోడానికి ప్రయత్నించే దెవరు ?

సమర్థుల మనుకొనే కొందరి గర్వపు ముసుగు, వారి ఎరుక లేకుండానే జారిపోతూ ఉంటుంది. ఆమె దూరంగా తొలగింది. అతను దగ్గరగా జరిగాడు. పెళ్ళి చేసుకొంటానని వాగ్దానం చేశాడు. ఆస్తి వ్రాస్తానని హామీ ఇచ్చాడు. ఇంకా ఇటు

వంటివే చాలా చెప్పి చూశాడు. అన్నిటికీ ఆమె జవాబు ఒకటే: "నన్ను బాధించకండి- మీరు బాధపడకండి." అతనెంత ప్రాధేయపడ్డా, ఆమె ప్రసన్నురాలు కాలేదు.

మునుపు ఎవర్నీ అతను ఇంతగా అడగలేదు. ఇప్పుడు ఎంత అడిగినా ఆమె కొంచమయినా కరగలేదు. క్రితం ఎవరికోసమూ వ్యధపడలేదు. ఇప్పుడు ఆమెకోసం బాధపడితే, ఆమె నిర్లిప్తే. అతనికి వ్యధే మిగిలింది. అతని అనురాగం ద్వేషంగా మారింది. దాని కతని ధనగర్వం శరీర బలం చేయూత నిచ్చాయి.

తాను చచ్చిపోతా నన్నాడు. ఆమె మాట్లాడ లేదు. ఆమెనే హత్య చేస్తానన్నాడు. ఆమె చలించలేదు. ఆమె బెదరిపోయేలా నవ్వి, రహస్యం వెల్లడి చేస్తానన్నాడు. ఆమె భర్తకి అంతా చెప్పే స్తానన్నాడు. ఆమె ప్రియుణ్ని నరికేస్తానన్నాడు. వికటంగా తిరిగి నవ్వేడు. తాను బ్రతికి వుండగా ఏమీ జరుగబోదనీ, అందర్నీ పేల్చేస్తాననీ, ఎక్కడ దాగున్నా గాలించి పట్టుకుంటాననీ, ఊపిరి సలప నీయననీ—ఇంకా అలాగే—రక్తం, రాబందులు; కత్తుకలూ, కత్తులూ—చాలా మాట్లాడేశాడు. అతని కటువు మాటల్లో కమ్మని మధువు వాసన్లు కూడా రేగేయి.

అతను శాంతించిన తరవాత, ఆమె శాంతంగా ఒక విషయం చెప్పింది: నేను బసచేసిన హోటలున్న ఊరిలో ఆమె అక్కగారు ఉన్నారట, అక్కడికని బయలుదేరి—అక్కణ్ణించి సిమ్లా వెళ్దాం రమ్మని చెప్పింది. అతను వచ్చి హోటల్లో నా పక్క గదిలో బసచేశాడు.

రక్తం, హత్య, మృత్యువు అన్నవి సులభంగా ఉచ్చరించి, స్వల్పాలూ, అల్పాలూ అని ప్రగల్భాలు పలికే వారే—తీరా అవి ఎదురైతే కంపిస్తారని ఆమెకు తెలియదు, పాపం.

ఏసాయంత్రమైతే ఆమెతో సిమ్లా వెళ్లాలో, ఆ రోజు ఉదయమే—నలుగురు సాగనంపగా అతను స్మశానానికి వెళ్లాడు. ఏ ఉదయమైతేఅతను స్మశానానికి వెళ్లాడో, ఆ రోజు సాయంత్రమే ఒక యువకునితో ఆమె డార్జిలింగ్ వెళ్లింది.

అతని కథ అయింది—ఆమె కథ ఉంది.

# ముద్దరాలు

మృత్యుదేవికొక
మంగళసూత్రం!

బాధలు మూల్గిన వేదన లేడ్చిన
రోదన లూదిన బాజాభజంత్రీల్
పూరిగుడిసెలో ఆరిన దివ్వెలో
ప్రకంపనంతో ప్రతిధ్వనించాయ్!

పెండ్లికుమారుని గాజుకండ్లతో
కుళ్లిన ఎముకల చల్లని కట్టెలో
మరిగే నెత్తురు మంటల నుంటలో
ప్రణయోత్సాహం ప్రళయోత్సాహం
శంఖనాదముల పూరించేశాయ్!

అదుగో వ్యర్థుడు అప్పటికప్పుడె
మృత్యుదేవి మెడ మంగళతంతువు
మూడుముళ్లుగా ముళ్లు ముళ్లుగా
తెగించి బిగించి ముగించి వేసెను.
మిత్తి కులట కిక కన్నెరికంరోయ్!

తరతరాలుగా నరనరాలలో
దాగిన కామం మూగి జ్వలింపగ
మృత్యు పెదిమల మంచుముద్దపై
ముద్దొక టద్దెను ముద్దుకుమారుడు...
ఆకలి జీవొక డంతరించెను.
మృత్యు వింకను
ముగ్ధకన్యకే! —బాలాజీ